క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగులు అందజేత



పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు చందపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆదివారం స్కూల్ బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. వైబ్రెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు నవీన్, ప్రమోద్‌కుమార్, పిట్ట భాస్కర్, సతీశ్‌కుమార్, లవణ్, సంజీవ్ ఉన్నారు.

గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పల్లె నారాయణగౌడ్(40) 9న ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో ఎడమ కాలు విరిగింది. పలు చోట్ల గాయాలయ్యాయి. చికిత్స చేయించుకుని ఇంటి వద్దనే ఉంటున్న గీత కార్మికుడిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె వీరస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ కొండ తిరుపతిగౌడ్ కోరారు.

బియ్యం అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము జగన్ రామగిరి నర్సింగం కుటుంబీకులకు క్వింటాల్ బియ్యం అందించారు. వాకర్స్ క్లబ్ సభ్యుడైన నర్సింగం ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అలాగే అసోసియేషన్‌లో తీసుకున్న రుణాన్ని కూడా మాఫీ చేయాలని సమావేశంలో నిర్ణయించామని జగన్ తెలిపారు. సభ్యులు భిక్షపతి, జైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య ఉన్నారు.

పలువురికి సాయం..

పెద్దపల్లిలోని గాయత్రీ విద్యాసంస్థల అధినేత, లయన్స్‌క్లబ్ ఎలైట్ వ్యవస్థాపకుడు అల్లెంకి శ్రీనివాస్ ఆదివారం పలువురికి ఆర్థికసాయం అందించారు. మంగపేటకు చెందిన కావ్యకు మెడికల్ అవసరం నిమిత్తం రూ.3వేలు అందించారు. ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేశారు. స్ఫూర్తి మానసిక దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసరుకులు అందించారు. జైపాల్‌రెడ్డి, వంశీరాజ్, భిక్షపతి, వెంకటేశ్, అతీఫ్ ఉన్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ ఏరియాలోని విశ్వకర్మ శివాలయ 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగుల మల్యాల రాజమౌళి ఆధ్వర్యంలో అర్చకులు మారుపాక శ్రీనివాసచార్యులు వేదపడితులతో కలిసి ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ఫల పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో మండపారాధన, హోమాలు, ఆలయ బలిహరణ, సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

శివాలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో శ్రావణమాసం సందర్భంగా వ్యాపారి సముద్రాల శంకర లింగం– పుష్పలత దంపతులు ఆదివారం స్వామివారికి రుద్రాభిషేకం, అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన భక్తులకు పూజారి మహేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు మమత, ప్రవీణ్, సమత, ప్రశాంత్, రమ్యలత, ప్రదీప్, రాజేశం, ఆనందం, ఏగోలపు సదయ్యగౌడ్ ఉన్నారు.

అనారోగ్యంతో కొలనూర్ మాజీ సర్పంచ్ మృతి



వెంకటరెడ్డి (ఫైల్)

ఓదెల: మండలంలోని కొలనూర్ మాజీ సర్పంచ్ గీట్ల వెంకటరెడ్డి(85) అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం ఉదయం ఇంట్లో అకస్మాత్తుగా కిందపడటంతో చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని పలువురు మాజీ ప్రజాప్రతినిదులు, నాయకులు, గ్రామస్తులు పరామర్శించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

కోల్‌సిటీ: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని రామగుండం నియోజకవర్గ ఐక్య స్వచ్ఛంద సంస్థల వేదిక అధ్యక్షుడు మంచికట్ల దయాకర్ కోరారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్లలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. రమేశ్, డినేశ్, చంద్రకళ, అనురాజ్, నసీమా, శ్రీదేవి, శిరీష, సుజాత, సరిత, రామదేవి పాల్గొన్నారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

- నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులతో ప్రజల ఇక్కట్లు
- ఎమ్మెల్యే ప్రారంభించినా ముందుకు కదలని పనులు
- ముగియనున్న కార్పొరేటర్ల పదవీకాలం
- త్వరగా పూర్తి చేయాలని డివిజన్‌వాసుల డిమాండ్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. డివిజన్‌లో సమస్యలు ఎక్కడిక క్కడ తిష్ట వేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డివిజన్ పరిధిలో అధికార యంత్రాంగం ఎండాకాలంలో తాగునీటి సరఫరా, వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయించేందుకు కనీసం కార్పొరేటర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహించలేదు. మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు సహకరించడం లేదంటూ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ బల్దియా ఎదుట బైఠాయించి నిరసన తెలియజేసిన విషయం విదితమే.



నిలిచిన ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు

ముగియనున్న కార్పొరేటర్ల పదవీకాలం..

2025 జనవరితో కార్పొరేటర్ల పదవీకాలం ముగియనుంది. మరో నాలుగు నెలలు మాత్రమే గడువు ఉండడంతో ఇప్పటికే ప్రారంభించి చేపడుతున్న అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు రాక పోవడంతో నిలిచిపోయాయి. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినా ఇంకా ప్రారంభించకపోవడం గమనార్హం.

ప్రారంభించిన అభివృద్ధి పనులు..

20వ డివిజన్‌లో రూ.40లక్షల పట్టణ ప్రగతి నిధులతో ప్రధాన డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. దీంతో మురుగు నీరు నిలిచి, దోమలు, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా రైల్వే వంతెన నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రూ.10లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రహ్మత్‌నగర్ కాలనీలో అంతర్గత రహదారికి రూ.5లక్షలు, శివాజీనగర్‌లో అంతర్గత రహదారులకు రూ.5 లక్షలు, రైల్వేస్టేషన్ ఎదుట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.20లక్షలు నిధులు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించాల్సి ఉంది.

ప్రతిపాదించిన పనులు..

అంబేద్కర్‌నగర్ కాలనీలో రూ.10 లక్షలతో అంతర్గత రహదారులు, రిటైరింగ్ వాల్ రూ.10లక్షలు, ఎస్సీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.30లక్షలు, పోచమ్మ, సాయిబాబా ఆలయం వరకు రోడ్లు నిర్మించాల్సి ఉంది. డివిజన్ పరిధిలో 84 స్ట్రీట్ లైట్స్ అవసరం ఉందని అధికారులను కోరగా కేవలం 24 పోల్స్ మాత్రమే కేటాయించగా అందులో పది స్ట్రీట్ లైట్లకు కనీసం విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా బిగించిన పలు విద్యుత్ స్తంభాలు ఇప్పుడే ఊగుతున్నాయి. ప్రతీ విద్యుత్ స్తంభానికి బిగించిన బల్బు వారం రోజులు కాకముందే కాలిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అభివృద్ధి కానరావడం లేదు



డివిజన్లలో చేపడుతున్న ప్రతీ పని నాసిరకంతో కూడుకోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణ పనులు, వెలగని వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బల్దియాకు కోట్లాది నిధులు కేటాయిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆ స్థాయిలో మాత్రం అభివృద్ధి కానరావడం లేదు.

– మంద శ్రీనివాస్, శివాజీనగర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..



ప్రతీ సీజన్‌లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై ముందస్తుగా డివిజన్ కార్పొరేటర్లతో అధికారులు సమీక్షా సమావేశం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం. కనీసం ఎండాకాలంలో తాగునీరు, వర్షాకాలంలో పారి శుధ్య నిర్వహణ పనులు సంపూర్తిగా చేసేందుకు సిబ్బంది, ట్రాక్టర్లు అందుబాటులో లేకపోవడం బాధాకరం. సమస్య పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు సకాలంలో కాంట్రాక్టర్లకు నిధులు కేటాయించాలి.

– కన్నూరి సతీశ్‌కుమార్, కార్పొరేటర్

సుల్తానాబాద్ బస్టాండ్ పైకప్పు కూల్చివేత



బస్టాండ్ పైకప్పును కూల్చివేస్తున్న కార్మికులు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తడకల షెడ్డు

- తాత్కాలికంగా తడకలతో షెడ్డు ఏర్పాటు

సుల్తానాబాద్: పట్టణంలోని బస్టాండ్ కూల్చివేతకు ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా సుల్తానాబాద్ బస్టాండ్ పైకప్పును కూల్చివేయడం మొదలుపెట్టారు. గతంలో స్లాబ్ నుంచి పెచ్చులూడి ప్రయాణికులకు గాయాలు కావడంతో ఆర్టీసీ అధికారులు ప్రమాదాల నివారణకు పైకప్పును కూల్చివేయడం ప్రారంభించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పక్కన తడకలతో పందిరి వేసి షెడ్డు ఏర్పాటు చేశారు.

42ఏళ్ల క్రితం నిర్మాణం..

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను 42ఏళ్ల క్రితం నిర్మించారు. శిథిలావస్థకు చేరడంతో పాటు రహదారి కంటే బస్టాండ్ కిందకు ఉండడంతో బస్టాండ్ నుంచి రోడ్డు ఎక్కే క్రమంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సుల్తానాబాద్ బస్టాండ్ నిర్మాణానికి స్థలం ఉందని, కొత్త బస్టాండ్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ నాయకుని కుటుంబానికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న కొప్పుల ఈశ్వర్

జూలపల్లి: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు రేచవేని శ్రీనివాస్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కాగా ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ సర్పంచ్ బదుగు ఈశ్వర్, నాయకులు దుగ్యాల వెంకట్రావు, కుమ్మరికుంట మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, పద్మశాలీ సంఘం నాయకులు మచ్చ యాదగిరి, ప్రకాశ్ ఉన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ధర్మారం: మండలంలోని రామయ్యపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మర్క సంధ్య అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

గోదావరిఖనిటౌన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక జనగామలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి అనంతరం క్షీరాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనగామ శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ నాయకులు పెద్దపల్లి రవీందర్, జక్కుల నరహరి, సుల్వ లక్ష్మీనర్సయ్య, ఇరువురాల శివకుమార్, శంకర్, సునీల్, సురేందర్, సుధీర్, రమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవి రమణ

ధర్మారం: పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన దేవి రమణ ఎన్నికయ్యారు. జిల్లా సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో దేవి రమణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీనియర్ క్రీడాకారుడు భరత్ తెలిపారు. ఎన్నికల అనంతరం రమణను క్రీడాకారులు సన్మానించారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మహేందర్

ఎలిగేడు: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నారాయణపల్లికి చెందిన కాసర్ల మహేందర్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, నాయకుడు కన్న రమేశ్ నియామకపత్రం అందజేశారు. నూతనంగా నియామకమైన మహేందర్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న మహేందర్

సంక్షిప్త వార్తలు

● సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఓదెల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి సూచించారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సైబర్ నేరాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ నుంచి అకస్మాత్తుగా డబ్బులు మాయం అయితే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలని, అకౌంట్‌ను బ్లాక్ చేయాలన్నారు.

● జమాత్ ఇస్లామీ హింద్‌లో చేరండి

గోదావరిఖనిటౌన్: సమాజ శాంతిస్థాపన కోసం జమాత్ ఇస్లామీ హింద్‌లో సభ్యులుగా చేరాలని జమాత్ ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె.ఎం జాఫర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్‌లోని జమా మసీద్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంథని, రామగుండం నియోజకవర్గంలోని ముస్లింలు జమాత్ సభ్యులు చేరాలని కోరారు.

● అనుమాల భద్రయ్యకు అయ్యప్ప సేవారత్న అవార్డు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన గురుస్వామి అనుమాల భద్రయ్య గురుస్వామికి అయ్యప్ప సేవారత్న అవార్డును ఆదివారం అఖిలభారత అయ్యప్ప జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు చేతుల మీదుగా అందుకున్నారు. తమిళనాడులోని కాంచీపురం కంచి కామాక్షి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది గురుస్వాములకు అవార్డులు అందించారు. అఖిలభారత అయ్యప్ప జాతీయ ఉపాధ్యక్షుడు విలాసాగరం వీరస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శిగా అయోధ్య రవీందర్

గోదావరిఖనిటౌన్: విశ్వహిందూ పరిషత్ కరీంనగర్ విభాగ్ (కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, కొమురంభీమ్, ఆసిఫాబాద్) కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన అయోధ్య రవీందర్ నియమితులయ్యారు. కామారెడ్డిలో జరుగుతున్న వర్షారంభ రాష్ట్ర సమావేశాల్లో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది.

రజక సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాజేశం

సుల్తానాబాద్: రజక సంఘం పట్టణ అధ్యక్షుడిగా నిట్టూరి రాజేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ ప్రకటించారు. పట్టణంలోని రజక సంఘం కమ్యూనిటీ హాల్లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రజకులు ఐక్యమత్యంగా నిలిచి రాజకీయంగా ఎదగాలని కోరారు.

● కరాటేలో విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

సుల్తానాబాద్: సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రాంత విద్యార్థులు కుంగ్‌ఫూ కరా టే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ సతీశ్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో జిల్లా నుంచి పలువురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని వివరించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ అభినందించింది.

● 14న జనజాగరణ జయప్రదం చేయాలి

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతువ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే దేశ స్వాతంత్ర్యాన్ని తాకట్టు పెడుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఆరోపించారు. 14న తలపెట్టిన జన జాగరణ కరపత్రాలను అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. నాయకులు రవీందర్, వెంకటస్వామి, తిరుపతి, మహేశ్, లక్ష్మణ్, అశోక్, వెంకటేశ్, దేవేందర్, శ్రీనివాస్, నరేశ్, ఖాజా, నాగయ్య ఉన్నారు.

● రామగిరి ఎస్సైగా పి.చంద్రకుమార్

రామగిరి: రామగిరి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా పి.చంద్రకుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

● ముత్తారం ఎస్సైగా నరేశ్

ముత్తారం: ముత్తారం ఎస్సైగా గోపతి నరేశ్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు పనిచేసిన ఎస్సై మధుసూదన్‌రావు మంచిర్యాల సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

● గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటర్‌లోని పాత బస్‌స్టేషన్‌లో ఆదివారం ఒక గుర్తు తెలియని వృద్ధుడు మరణించి ఉన్నాడన్న సమాచారం మేరకు ఎస్సై సతీశ్ తన సిబ్బందిని పంపించాడు. మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. 60ఏళ్ల వయస్సు ఉంటుందని, స్థానికంగా విచారించగా లక్షెట్టిపేటకు చెందిన రాములుగా తెలిపారు. వృద్ధుడికి సంబంధించిన వ్యక్తులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సతీశ్ 87126 56526 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–మంథని మధ్య ఆర్టీసీ బస్సులు తక్కువగా నడుస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే వారికి అనుగుణంగా బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చొరవ చూపాలి.

– కొంకటి లింగమూర్తి, బ్రాహ్మణపల్లి

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 98499 71500

చంద్రకళకు నల్ల వజ్రం కీర్తి పురస్కారం



అవార్డు అందుకుంటున్న చంద్రకళ

జ్యోతినగర్: తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ కళోత్సవాల్లో గోలివాడ చంద్రకళ నల్ల వజ్రం కీర్తి పురస్కారం అందుకున్నారు. శనివారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం ఈడీసీలో జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవలో భాగంగా 25ఏళ్లుగా మహిళా అభ్యుదయానికి, పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు తారా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు సంకె రాజేశ్, రామగుండం పోలీస్ కమిషనరేట్ ఏసీపీ ప్రతాప్, ఎన్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్, రాజు, డాక్టర్ గూడ సాయి చందర్ నల్ల వజ్రం కీర్తి పురస్కారం అందించారు.

సంతకాల సేకరణ విజయవంతం చేయాలి

జూలపల్లి: మండల అభివృద్ధి కోసం స్టేట్ హైవే సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి చేపడుతున్న ఊరూరా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండల ప్రజలు విజయవంతం చేయాలని సమితి కన్వీనర్ మారం తిరుపతియాదవ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చేసిన జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు పాదయాత్రతో దిగివచ్చిన నాయకులు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారని, ఇదే స్ఫూర్తితో మళ్లీ స్టేట్ హైవే సాధనకు సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న సంతకాల సేకరణ కోనరావుపేటలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. సంతకాల సేకరణకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సాధన సమితి సభ్యులు రమణ తదితరులు ఉన్నారు.

జీడీకే–5 ఓసీపీలో కొత్త యంత్రాలు తెప్పించాలి

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీలో పాత యంత్రాల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేయాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య డిమాండ్ చేశారు. జీడీకే–5 ఓసీపీలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. రక్షణపై అధికారులు సమావేశం నిర్వహించకపోవడంతో కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. యంత్రాల బ్రేక్‌డౌన్‌తో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ప్రభుదాస్, ఆరెల్లి పోషం, మాదన మహేశ్, గండి ప్రసాద్, చంద తిరుపతి, శ్రీనివాస్, ఎ.రాజిరెడ్డి, సోమ నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అన్ని బ్యాంకుల ఖాతాలకు వర్తింపజేయాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల రూ.30లక్షల ప్రమాదబీమా అన్ని బ్యాంకుల్లో ఖాతా ఉన్న కార్మికులకు వర్తింపజేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం ఒక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు మాత్రమే రూ.30లక్షల ప్రమాద బీమా వర్తించేలా ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. మెడికల్ టెస్టుల పేరుతో కాంట్రాక్టు కార్మికులను వేధింపులకు గురి చేయొద్దన్నారు. సీఎంపీఎఫ్ స్లిప్పులను వెంటనే అందజేయాలన్నారు. కార్మికుల జీతాల నుంచి రికవరీ చేసిన సీఎంపీఎఫ్ డబ్బులను డిపాజిట్ చేయాలని కోరారు. నాయకులు అక్బర్‌అలీ, గౌస్, రాజరత్నం, దినేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దూసుకెళ్లిన వందేభారత్



ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఓదెల, కొలనూర్ రైల్వేస్టేషన్ల మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం వందేభారత్ రైలు వేగంగా దూసుకెళ్లడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. వందేభారత్ రైలు గురించి రైల్వేసిబ్బందిని అడగగా విజయవాడ నుంచి కాజీపేట్ వయా నాగపూర్ వరకు ట్రయల్‌రన్‌గా నడిపిస్తున్నట్లు తెలిపారు.

సదయ్యగౌడ్‌కు సన్మానం

సుల్తానాబాద్: భవన నిర్మాణ కార్మికుడు ఏగోలపు సదయ్యగౌడ్‌ను భవన నిర్మాణ కార్మికులు ఆదివారం సన్మానించారు. సదయ్యగౌడ్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి వేములవాడ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కేంద్రంలో సన్మానించింది. భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుంకపాక గంగారం, చంద్రగిరి అంజి, బండి శివ, కందూరి సత్యలింగం, భాస్కర్, పరశురాం, బాబు, గణేశ్, రవి, చంద్రలింగం, శ్రీనివాస్, కిరణ్, రవి, సింటు, హరీశ్, శంకర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఓదెల: మండలంలోని మడక, కనగర్తి, ఓదెల గ్రామాల్లో ఇటీవల రాజకొమురయ్య, మాతంగి పోచమల్లు, గడ్డం రాజయ్య మృతిచెందారు. ఆ కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష ఆదివారం పరామర్శించారు. నాయకులు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, పోలోజు రమేశ్, తూడి సంపత్, బండ నిఖిల్, ఆముదాల అరుణ పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమం చేద్దాం

జ్యోతినగర్: అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకై ఉద్యమిద్దామని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు ఆడెపు శంకర్, గౌరవ అధ్యక్షుడు గుజ్జుల సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రన్న, రాయమల్లు, సదానందం, రాజయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

రామగుండం: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం విద్యార్థినులకు షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రద్దీ ప్రదేశాలు, స్కూల్స్, కళాశాలల సమయాల్లో విద్యార్థినులపై ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు తెలిపారు. షీ టీం పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు సురేశ్, స్నేహలత ఉన్నారు.

బీరన్నగుడి నిర్మాణానికి భూమిపూజ

ఓదెల: మండలంలోని అబ్బిడిపల్లెలో బీరన్న గుడి నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒజ్జ కోమల శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.